ఉదయ్‌చందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

గుండెపోటుతో ఉదయ చందర్ మృతి

కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ రవీందర్, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చుక్కల ఉదయ్‌చందర్ (59) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఉదయ్‌చందర్ మృతదేహాన్ని చూసి కంట తడి పెట్టారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ పట్టణ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు. కాగా, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్ ఉదయ్‌చందర్ అంత్యక్రియల్లో పాల్గొని పాడెను మోశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ప్రజాసమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- ఇనుగుర్తిలో పోలీస్ స్టేషన్, ఎంపీడీవో ఆఫీస్ ఏర్పాటు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

ఇనుగుర్తి, అక్టోబర్ 1 : ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇనుగుర్తిని మండలం చేయకపోతే తాను భవిష్యత్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేయనని శపథం చేసి మండలాన్ని సాధించి, వెంటనే తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు పూర్తయినా పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు ఏర్పాటు చేయకుండా ప్రజలను ఇబ్బందిపెడుతున్నదన్నారు. వెంటనే ఏర్పాటు చేయకపోతే ప్రజాపోరాటాలతో ప్రభుత్వ మెడలు వంచి తీసుకొస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేశానని, కానీ, అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఆగిపోయినట్లు తెలిపారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మండలాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో రహదారులు తెగిపోయాయని, వాటికి మరమ్మతు చేయించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కేసముద్రం మాజీ ఏఎంసీ చైర్మన్ నీలం దుర్గేశ్, మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి,మాజీ మండల మాజీ అధ్యక్షుడు హరీశ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు రామ్మూర్తి, అరుణాహరిచంద్‌నాయక్, రామన్ననాయక్, మాజీ ఎంపీటీసీలు పింగిలి రజితాశ్రీనివాస్, మాలోత్ మంజుల పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం గరంగరం

- ఇంటి నంబర్లు ఇవ్వాలని కాంగ్రెస్ వార్డు సభ్యుల నిరసన
- పేదల ఇండ్లను కూల్చొద్దని ఆందోళన
- నిరుపేదలకు ప్రభుత్వం న్యాయం చేస్తుంది
- ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



పట్టణంలో ఇండ్లకు ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ కౌన్సిలర్లు నిరసన

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 1 : మహబూబాబాద్ మున్సిపల్ సమావేశం గరంగరంగా సాగింది. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా కాంగ్రెస్ వార్డు సభ్యులు హరిసింగ్, భూక్యా శ్రీను విలీన గ్రామాల్లో అనేక సమస్యలున్నాయని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, పేదలకు ఇంటి నంబర్లు ఇవ్వడం లేదని ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాల క్రితం పేదలు కట్టుకున్న ఇండ్లను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూలగొడతామని నోటీసులు ఇచ్చారని, ఇవి ప్రభుత్వం ఇచ్చిందా .. లేక మున్సిపల్ అధికారులు సొంతంగా ఇచ్చారా చెప్పాలని సీపీఐ, సీపీఎం వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. నెహ్రూ సెంటర్ నుంచి పత్తిపాక వరకు నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో గుంతలు పడి ప్రజలు ఇబ్బందిపడుతున్నారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ పరిధిలోని 21 కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, నీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలని కౌన్సిలర్లు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు న్యాయం చేస్తుందన్నారు. ఇప్పటికే ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందన్నారు. దసరా పండుగ నాటికి అందరికీ నూతనంగా ఆరోగ్య హెల్త్ కార్డులు ఇస్తామని, దీనితోనే రేషన్ కూడా పొందవచ్చన్నారు. విద్యుత్, మున్సిపల్ అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులకు నోటీసులు ఇవ్వకుండానే సస్పెండ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుటుంబ వివరాలు సేకరించాలి

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి: వీసీలో మంత్రి పొంగులేటి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 1 : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం వివరాలను పక్కాగా సేకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గం నుంచి రెండు లేదా ఒక గ్రామపంచాయతీ, ఒక డివిజన్‌ను తీసుకొని కుటుంబాల వివరాలను సేకరించాలని ఆదేశించారు. సర్వే కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు సర్వేను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500అదనంగా అందజేయటం జరుగుతుందని, ఇందుకోసం సన్న, దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఆర్డీవోలు అలివేలు, అధికారులు పాల్గొన్నారు.

అడవి జంతువును వధించిన ముగ్గురిపై కేసు

బయ్యారం,అక్టోబర్ 1: అటవీ జంతువును వధించిన కేసులో అటవీశాఖ అధికారులు మంగళవారం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. డీఆర్‌వో ఉమారాణి తెలిపిన కథనం ప్రకారం.. గతనెల 26న చింతోనిగుంపు గ్రామ సమీపంలోని వంకమడుగు గండి వద్ద అడవిజంతువును వధించారనే సమాచారంతో అటవీశాఖ అధికారులు ఆ పరిసరాలను పరిశీలించగా, అడవి జంతువు అవశేషాలు దొరికాయి. శాంపిల్స్‌ను ల్యాబ్ పంపిన అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. చింతోనిగుంపునకు చెందిన చింత లక్ష్మీనారాయణ, పొడుగు ప్రసాద్, మొకాళ్ల రవి అడవి పందిని వధించారని విచారణలో తేలడంతో వన్య ప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

మోహన్‌నాయక్‌కు అభినందన

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 1 : మండలంలోని మల్యాల గ్రామ శివారు దామ్మతండాకు చెందిన మోహన్‌నాయక్ డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీలో 69 మార్కులు సాధించారు. మంగళవారం సేవాలాల్ సేన నాయకులు ధరావత్ వెంకన్న, నందులాల్ నాయక్ ఆయనను కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు.

బేస్‌బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్ అక్టోబర్ 1 : పంజాబ్ రాష్ట్రంలో ఈ నెల 3న జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బేస్ అసోసియేషన్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్ తెలిపారు. కేసముద్రం మండలం కల్వలకు చెందిన భూక్యా బాలాజీ, శ్రావణి, వీఎస్ లక్ష్మీపురానికి చెందిన కల్యాణి ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. వీరి ఎంపికపై జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరావు, పలువురు పీఈటీలు అభినందనలు తెలిపారు.

వైద్య సేవలో జిల్లాను ముందుంచాలి

జిల్లా వైద్యాధికారి మురళీధర్

తొర్రూరులో నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

తొర్రూరు, అక్టోబర్ 1 : ప్రజలకు వైద్య సేవలు అందించడంలో జిల్లాను ముందంజలో ఉంచాలని జిల్లా వైద్యాధికారి గుండాల మురళీధర్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాలను అగ్రభాగంలో నిలుపాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లాలో స్త్రీ, పురుషుల నిష్పత్తి తగ్గితున్నదని, లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 104, డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్వలిత, డాక్టర్ మానస, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, రవీందర్‌రావు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రాజు, పురుషోత్తం, హెల్త్ ఎడ్యుకేటర్స్, డీపీఎంవో వనాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'చలో నిధానపురం'లో ఘర్షణ

దంతాలపల్లి, అక్టోబర్ 1 : ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో నిధానపురం' కార్యక్రమం ఘర్షణకు దారితీసింది. గ్రామంలోని సర్వే నంబర్ 320, 321లోని 12 గుంటల భూమిని గ్రామానికి చెందిన పృథ్వీరెడ్డి 2013లో దేవాలయ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ అందించినట్లు కొంతమంది గ్రామస్తులు చెబుతుండగా, మరికొంత మంది అది ఎస్సీలకు చెందిన భూమి అని అంటున్నారు. కాగా, ఆ భూమిలో బతుకమ్మ వేడుకల కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏర్పాట్లు చేస్తుండగా మంగళవారం ఎస్సీలకు చెందిన భూమిని ఎలా తీసుకుంటారని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో నిధానపురం కార్యక్రమం చేపట్టారు. భూమిలో జెండాలను పాతడంతో ఇరువర్గాలకు మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరు వర్గాలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 11మందిని బైండవర్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

సీతారాంతండా వాసులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న సెయింట్ ఆగస్టీన్ యాజమాన్యం

మరిపెడ, అక్టోబర్ 1 : భారీ వర్షాల కారణంగా ఇటీవల ముంపునకు గురైన సీతారాంతండా వాసులకు స్థానిక సెయింట్ ఆగస్టీన్ పాఠశాల యా జమాన్యం మంగళవారం నిత్యావసర వస్తువులను అందజేసింది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించగా వచ్చిన డబ్బులతో బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ దీన, కరస్పాండెంట్ షీనాటోమ్, వైస్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సీ పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

గార్ల: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న టీచర్లు

నర్సింహులపేట పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

గూడూరులోని అరవింద విద్యాలయంలో ..

కురవి: బలపాల పాఠశాలలో కాగితపు పూల బతుకమ్మలతో విద్యార్థులు

బయ్యారం: గంధంపల్లి అక్షర నికేతన్‌లో..

నెల్లికుదురులో..

కేసముద్రం: శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో..

బతుకమ్మ సంబురాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ముందస్తు బతుకమ్మ సంబురాలు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. కురవి మండలం బలపాల ప్రాథమిక పాఠశాలలో కాగితపు పూలతో బతుకమ్మ పేర్చారు.మహబూబాబాద్‌లోని మాధవాపురం, కంబాలపల్లి, జంగిలికొండ, అనంతారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, కేసముద్రం మండలంలోని బోడగుట్ట తండా, కేసముద్రం స్టేషన్, కల్వల ప్రభుత్వ పాఠశాలల్లో, డోర్నకల్ మండలం మల్లాయకుంటతండా ఎంపీపీఎస్ పాఠశాలలో, గూడూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో, గార్ల, బయ్యారం, పెద్దవంగర, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

8న జాబ్ మేళా

డోర్నకల్, అక్టోబర్1: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 8న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని డోర్నకల్ సీఐ భూక్యా రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఫార్మసీ అర్హత కలిగిన యువత సద్వినియోగం చేసుకోవాలని సీఐ పేర్కొన్నారు.

హక్కులను కాపాడుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : కార్మికవర్గం ఐక్యంగా పోరాటం చేసి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, సూర్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ విలీన సభపోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 40సంవత్సరాలుగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఐఎఫ్‌టీయూ ఈ నెల 20న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఫర్ ఇండియాలో విలీనం కానున్నదన్నారు. కార్యక్రమంలో యాకయ్య, రామదాసు, పవన్, నరేశ్, శివ పాల్గొన్నారు.

సహజ ప్రసవాలపై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్ రూరల్ : గర్భిణులకు సహజ ప్రసవంపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. మంగళవారం పట్టణంలో పీహెచ్‌సీ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాలను వందశాతం పూర్తి చేయాలన్నారు. కీటక జనిత వ్యాధులు డెంగ్యూ, మలేరియా వ్యాధులపై తగు జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సారంగపాణి, సుధీర్‌రెడ్డి, వైద్యులు ప్రసాద్, శ్రవణ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షపై విద్యార్థులకు అవగాహన

మహబూబాబాద్ రూరల్ : పట్టణంలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ.. భూసారానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఏ సమయంలో, ఏ మోతాదులో మందులు వేయాలో భూసార పరీక్ష ద్వారానే తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ ముఖేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

మహబూబాబాద్ రూరల్ : ప్రజావ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటం చేయాలని సీపీఎం పట్టణ అధ్యక్షుడు బానోత్ నీతారాం అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడారు. శివారు కాలనీల్లో అంతర్గత రోడ్లు, తాగు నీరు, విద్యుత్ మీటర్లపై అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. పేదల ఇండ్లకు రక్షణ కల్పించేలా విధానాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో నాగన్న, రాములు, వెంకన్న, మోహన్ పాల్గొన్నారు.

రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 1 : ఎరువులు కొన్న రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని ఏడీఏ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని పీఏసీఎస్ సొసైటీ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రైతుల ఆధార్ కార్డ్‌ను ఈ పాస్‌తో ఎంటర్ చేసిన తర్వాతనే ఎరువులను ఇవ్వాలన్నారు. అన్ని సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉందని, బయట ఎక్కువ ధరకు కొని మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

కేసముద్రం, అక్టోబర్ 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణాలను వెంటనే మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్వల గ్రామంలో మంగళవారం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అనంతరం కల్వల గ్రామ కార్యదర్శిగా తాడబోయిన లింగమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుంకరి వెంకన్న, గుని గంటి రాజన్న, నక్క సైదులు, వెంకటేశ్వర్లు, జల్లె జయరాజ్, తాడబోయిన శ్రీశైలం, శాగంటి కిషన్, ఉప్పలయ్య, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

మల్టీ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి

నెల్లికుదురు, అక్టోబర్ 1 : గ్రామాల్లో పనిచేసే కార్మికుల మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండల అప్పిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను రెండో పీఆర్సీ కిందికి తేవాలన్నారు.

పంటసాగులో రసాయనాలు తగ్గించాలి

నెల్లికుదురు, అక్టోబర్ 1 : పంటల సాగులో రసాయనాలను తగ్గించి, కషాయాలు వాడాలని మైరాడ సంస్థ మండల కో ఆర్డినేటర్ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో కషాయాలు, సేంద్రియ ఎరువుల తయారీ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు, రైతులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత?

నర్సింహులపేట : అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. మరిపెడ, నర్సింహులపేట మండలాల్లో సేకరించిన బియ్యాన్ని లారీలో లోడ్ చేసి వరంగల్ వైపు తరలిస్తుండగా నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల పరిధిలో మంగళవారం పట్టుకున్నట్లు సమాచారం.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 1 : సీనియర్ సిటిజన్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సీనియర్ సిటిజన్లు తమ జీవన శైలిని మార్చుకోవాలన్నారు. కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటే తమ పని తాము చేసుకునే వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు వరలక్ష్మి, నర్మద, శాంతికుమారి పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

డోర్నకల్, అక్టోబర్ 1 : మున్సిపాలిటీ పరిధిలోని బతుకమ్మ పార్కు వద్ద పండుగ ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్మన్ వీరన్న, కమిషనర్ నరేశ్‌రెడ్డి పరిశీలించారు. 9 రోజులు నిర్వహించే బతుకమ్మ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శరత్ బాబు, హెల్త్‌అసిస్టెంట్ అహ్మద్ పాల్గొన్నారు.

నేడు ఏకలవ్య భవనం ప్రారంభం

కొత్తగూడ, అక్టోబర్ 1: కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి గ్రామంలో నిర్మించిన ఏకలవ్య పాఠశాల భవనాన్ని మంత్రి సీతక్క, ఎంపీ బలరానాయక్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

మహబూబాబాద్ రూరల్ : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి అన్నారు. మంగళవారం పట్టణంలోని ముత్యాలమ్మ సెంటర్ నుంచి నెహ్రూ సెంటర్‌కు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. 'ప్లాస్టిక్ కవర్లు వద్దు.. పేపర్ కవర్లు ముద్దు' అంటూ విద్యార్థులతో నినాదాలు చేయిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

లక్ష్యసాధన కోసం కృషి చేయాలి

కొత్తగూడ, అక్టోబర్ 1 : విద్యార్థులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని బాలికల ఆశ్రమోన్నత పాఠశాల హెచ్ఎం రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME
★I, KANTHA RAO VINAYAK RAO GANTI S/o GANTI VINAYAKA RAO, R/o. H.No. 5-10-135, Kishanpura, Hanamkonda, Hanumakonda-506001., Telangana, India have changed my name to KANTHA RAO GANTI and solemnly declare.
NTW-000

CHANGE OF NAME
★I, GANTI RAVI KUMAR KANTHA RAO S/o KANTHA RAO GANTI, R/o. H.No. 5-10-135, Kishanpura, Hanamkonda, Hanumakonda-506001., Telangana, India have changed my name to RAVI KUMAR GANTI and solemnly declare.
NTW-000

CHANGE OF NAME
★ I Potireddy Ravinder (old Name), H.No. 8-2-70/43A. Writer Basthi, Gollagudem, kothagudem Bhadradri kothagudem-507101, Telangana, India,have changed my name Potireddy Ravinder Reddy to Pothireddy Ravindar Reddy (New name), S/o Potireddy Papi Reddy.
NTW-000

CHANGE OF NAME